సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం । 25 । డిసెంబర్ । 2024



సోమశిలలో 72.094 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం 72.084 టీఎంసీల నీరుంది. వివిధ కాలువలకు 3,750 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.78,290
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.7,082
3శాతం జీఎస్టీతో	రూ.7,294
సవర (8గ్రా)	రూ.58,352

గరిష్టం/కనిష్టం
31.2 /22.9

వాతావరణం

జిల్లాలో బుధవారం అక్కడక్కడా మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ మంగళవారం 96 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

రైతుల సమస్యలపై కాల్ సెంటర్

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లాలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ప్రత్యేక కాల్ సెంటరును ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి సత్యవాణి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎరువులు దొరక్కపోయినా, ఎక్కడైనా అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నా కాల్ సెంటర్‌కు ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. 83310 57182, 83310 57218 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు.

అవుట్ సోర్సింగ్ టీచర్ల నిరసన



నెల్లూరు(వీఆర్సీసెంటర్): గిరిజన గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులను సీఆర్టీలుగా మార్చాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మంగళవారం ఐటీడీఏ కార్యాలయం వద్ద గిరిజన గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా నాయకులు దినారి ప్రభాకర్, గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం గత 40 రోజులుగా ఆందోళన చేస్తున్నా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. అనంతరం ఐటీడీఏ ఏపీఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, కళ్యాణి, మహ్మద, శిరీషా, దిల్షాద్, సుబానీ బేగం, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలను అరికట్టండి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: వైద్యారోగ్యశాఖ సిబ్బంది మాతా శిశు మరణాలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఒ.ఆనంద్ అన్నారు. మంగళవారం సాయంత్రం తిక్కన ప్రాంగణంలో మాతా శిశు మరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ముగ్గురు వ్యక్తులు చనిపోయారన్నారు. ఆరోగ్యశ్రీ సదుపాయం ఉన్న వ్యక్తులను అడ్మిట్ చేసుకోకుండా జీజీహెచ్‌కు రిఫర్ చేయడంపై ఓ ప్రైవేట్ వైద్యశాలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తగిన విచారణ చేయాలని ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్‌ను ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏఎన్ఎం, ఆశావర్కర్ సంబంధిత మెడికల్ ఆఫీసర్లపై తగిన చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓకు ఆదేశాలు ఇచ్చారు. ప్రసవాల కోసం ఆస్పత్రులకు వచ్చే హైరిస్క్ కేసులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌ఓ సుజాత, డీసీహెచ్చెస్ రమేష్‌నాథ్, అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, జీజీహెచ్ గైనకాలజిస్ట్, పీహెచ్‌సీ డాక్టర్లు పాల్గొన్నారు.

మైకా కార్మికుల ఆకలి కేకలు

- వేమిరెడ్డి తీరుతో ఏడునెలలుగా మూతపడిన గనులు
- సంగీత నృత్య అకాడమీ మాజీ చైర్‌పర్సన్ శిరీషా యాదవ్

సైదాపురం: మైకా గనుల మూతతో వేలాది మంది కార్మికులు ఆకలి కేకలతో అలమటిస్తున్నారని రాష్ట్ర సంగీత నృత్య అకాడమీ మాజీ చైర్‌పర్సన్ పొట్టేళ్ల శిరీషా యాదవ్ ఆరోపించారు. మండలంలోని తురిమెర్ల గ్రామంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. సైదాపురం మండలంలో ఉన్న గనులన్నీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వల్లే గత ఏడునెలలుగా మూతపడ్డాయని ఆమె తెలిపారు. గనులన్నీ మూతపడడంతో వాటికి అనుబంధంగా ఉన్న ట్రాక్టర్లు, జేసీబీలు మూలపడిపోయాయన్నారు. కనీసం ఈఎంఐలు కూడా కట్టుకోలేని దుస్థితిలో యజమానులు ఉన్నారని ఆమె పేర్కొన్నారు. పండగ రోజుల్లో కూడా తమ ప్రాంతంలో ఉన్న గని కార్మికులు పస్తులుండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. గతంలో సైదాపురం మండలంలో క్వార్ట్జ్ ఖనిజాన్ని దోచుకున్నవారికే మళ్లీ మైనింగ్ పరిశ్రమలను అప్పగించేలా ఎంపీ పావులు కదుపుతున్నారన్నారు. వారే అతిపెద్ద కార్యాలయాన్ని కూడా నిర్మిస్తున్నారని తెలిపారు. ఇకనైనా స్పందించి మైనింగ్ పరిశ్రమను సరైనవారికి అప్పగించి కార్మికులను కాపాడాలని వైఎస్సార్‌సీపీ తరఫున తాను ప్రాధేయపడుతున్నానని ఆమె పేర్కొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై 27న వైఎస్సార్‌సీపీ పోరుబాట



పోరుబాట పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఎమ్మెల్సీలు మురళీధర్, పి.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

- పోస్టర్లను ఆవిష్కరించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి
- పాల్గొన్న నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు

నెల్లూరు(బారకాసు): ఎన్నికలకు ముందు ఐదు సంవత్సరాల వరకు విద్యుత్ చార్జీలు పెంచేది లేదని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం.. ఇప్పుడు ఇబ్బడి ముబ్బడిగా ప్రజలమీద భారం మోపిందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. కరెంట్ చార్జీలు బాదుడుపై ఈనెల 27న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న పోరుబాట పోస్టరును మంగళవారం నెల్లూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ మంత్రి కాకాణి, పలు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాకాణి మీడియాతో మాట్లాడారు. విద్యుత్ చార్జీలు పెంచడం వలన ప్రజల జీవితాలు గాడాంధకారంలోకి వెళ్లే పరిస్థితి వస్తోందన్నారు. ప్రజలు 164 సీట్లు బాబుకు ఇస్తే, బాబు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలకు షాక్ ఇచ్చారన్నారు. మధ్య తరగతి ప్రజలపై అధిక భారం మోపనున్నారు. వైఎస్ జగన్ హయాంలో దళితులకు ఉచిత విద్యుత్ అందించి దాదాపు రూ.650 కోట్లు విద్యుత్ సబ్సిడీ చెల్లించారన్నారు. ప్రభుత్వం మెడలు వంచి ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్ చార్జీలు తగ్గించేలా పోరాడతాం. చంద్రబాబు సూపర్‌సిక్స్ హామీలను విస్మరించి వాటిని పట్టించుకోకుండా ప్రజలపై అదనపు భారం మోపే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రెండు విడతల్లో ఒకసారి రూ.6 వేల కోట్లు, రెండవసారి రూ.9 వేల కోట్లు మొత్తం రూ.15 వేల కోట్లు పెంచి ప్రజలపై భారం మోపారన్నారు. ప్రజలకు అండగా నిలవాలని, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు, ధర్నాలు కొనసాగిస్తామన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 27న ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల స్థాయిలో విద్యుత్ కార్యాలయాల వద్ద పోరుబాటు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కాకాణి పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, ఎమ్మెల్సీ, నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, మహిళా విభాగ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీసునంద, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

క్రిస్మస్ సందడి



జిల్లాలో క్రిస్మస్ సందడి మొదలైంది. మంగళవారం రాత్రి నుంచే చర్చిల్లో ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నెల్లూరు దైకస్‌రోడ్డు వెంగళరావు నగర్‌లో కాంతులీనుతున్న పరిశుద్ధ జపమాల మాత చర్చి. (ఇన్‌సెట్లో) బాలయేసు ప్రతిమ



వెంకటశేషయ్యను వెంకటాచలం తీసుకురావడంతో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి వెళ్తున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

కూటమి ప్రభుత్వం కుట్రలు

- వైఎస్సార్‌సీపీలో చురుకైన నేతలే లక్ష్యం
- అందులో భాగంగానే వెంకటశేషయ్య అరెస్ట్

వెంకటాచలం: మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముఖ్య అనుచరుడు, వెంకటాచలం మాజీ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మందల వెంకటశేషయ్యను రాజకీయ కుట్రతోనే పోలీసులు అరెస్ట్ చేశారనే విమర్శలు వస్తున్నాయి. ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటాచలం సీఐ పి.సుబ్బారావు వెంకటశేషయ్యను సోమవారం అరెస్ట్ చేసి నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. రాత్రి సమయంలో నాలుగో జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు ఎదుట హాజరుపరిచారు. కేసుకు సంబంధించిన పలు పత్రాలు లేవని, మంగళవారం తీసుకురావాలని పోలీసులను ఆదేశించారు. దీంతో వారు వెంకటశేషయ్యను రూరల్ పోలీస్‌స్టేషన్‌లోనే ఉంచి మంగళవారం ఉదయం వెంకటాచలం తీసుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వెంకటశేషయ్యను తరలించే పోలీసు వాహనం వెంట వెళ్లారు. తొలుత తహసీల్దార్ కార్యాలయం, అనంతరం వెంకటశేషయ్యపై ఫిర్యాదు చేసిన మహిళ అత్తమామల నివాసానికి తీసుకెళ్లారు. అయితే అక్కడెవరూ లేకపోవడంతో తిరిగి నెల్లూరు జిల్లా కోర్టుకు తరలించి, మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచడంతో వచ్చేనెల 6 తేదీ వరకు వెంకటశేషయ్యకు రిమాండ్ విధించారు. వెంకటశేషయ్య అరెస్ట్ వెనుక రాజకీయ కుట్ర ఉందనే విమర్శలు వస్తున్నాయి. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ముఖ్య అనుచరుడిగా రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నందునే ఆయనను ఎలాగైనా అణగదొక్కాలనే కుట్ర కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జరుగుతోంది. అందులో భాగంగానే స్థానికంగా ఇక్కడ లేకుండా సూళ్లూరుపేట ప్రాంతంలో నివాసం ఉండే మహిళ ఇచ్చిన ఫిర్యాదుతో అక్రమ కేసు నమోదు చేశారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదు చేసిన మహిళకు, ఆమె అత్తమామలైన వెంకటమ్మ, పెంచయ్యలకు ఆర్థిక లావాదేవీలకు సంబంధించి వివాదం ఉంది. ఈ విషయం గురించి ఆ మహిళతో వెంకటశేషయ్య మాట్లాడడం కారణంగానే అక్రమ కేసు నమోదు చేసి జైలుకు పంపారనే విమర్శలున్నాయి.

వెంకటశేషయ్యకు ఏ పాపం తెలీదు : కాకాణి

నెల్లూరు(బారకాసు): సర్వేపల్లి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీలో కీలకంగా వ్యవహరిస్తున్న తమ పార్టీకి చెందిన బీసీ నాయకుడు మందల వెంకటశేషయ్యకు ఏపాపం తెలీదని, అతనిపై అక్రమ కేసు బనాయించారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. నగరంలోని సాయిరాంనగర్‌లో ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో కాకాణి మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చేస్తున్న అన్యాయ, అక్రమాలపై గళం విప్పిన వెంకటేశేషయ్యను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేక సోమిరెడ్డి దొంగ కేసు పెట్టించారన్నారు. వెంకటశేషయ్యను అభాసుపాలు చేసిన సీఐ, ఆర్‌ఐలను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదన్నారు. వారిద్దరిపైన ప్రైవేట్ ఫిర్యాదు ఇవ్వబోతున్నామన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు మేరిగ మురళీధర్, పి.చంద్రశేఖర్‌రెడ్డి, ఇంకా మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీసునంద పాల్గొన్నారు.



వెంకటశేషయ్యను వెంకటాచలం తీసుకొచ్చిన సీఐ సుబ్బారావు

వచ్చే నెల 6 వరకు రిమాండ్

నెల్లూరు (లీగల్): వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మందల వెంకట శేషయ్యకు జనవరి 6 వరకు రిమాండ్ విధిస్తూ నెల్లూరు 4వ అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు న్యాయమూర్తి భాస్కర్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. వెంకటాచలం పోలీసులు నమోదు చేసిన కేసులో వెంకట శేషయ్యను పోలీసులు కోర్టులో హాజరుపరచగా ఆయన తరఫున సీనియర్ న్యాయవాదులు రామిరెడ్డి రోజారెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, పోలీసుల తరఫున ఏపీపీ మాల్యాద్రి వాదించారు. అనంతరం న్యాయమూర్తి వచ్చే నెల 6 వరకు రిమాండ్‌కు ఆదేశాలు జారీ చేశారు.

కారు అలవెన్స్ నిధుల స్వాహా

బిల్లులు పెట్టి.. సొమ్ము చేసుకున్న వైనం

- నెలకు రూ.35 వేల లెక్కన ఒకేసారి ఆరునెలల బిల్లు డ్రా
- ఎన్నికల డ్యూటీ, ట్రైనింగ్ కాలంలో కూడా కారు వాడినట్లుగా బిల్లులు
- దుర్వినియోగమవుతున్న ప్రభుత్వ సొమ్ము
- పట్టించుకోని ఐసీడీఎస్ జిల్లా అధికారులు

ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీలు, క్యాంపులు, మీటింగ్‌లు, ట్రైనింగ్‌లు ఉంటే సీడీపీఓ (చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్) కారు ఉపయోగించుకుని బిల్లు పెట్టుకుంటారు. దీనికి కారు అలవెన్స్ కింద నెలకు రూ.35 వేలు ప్రభుత్వం అందజేస్తుంది. ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీలకు, సమావేశాలకు, సెక్టార్ మీటింగ్‌లకు, ఐసీడీఎస్ కార్యాలయ పనులపై వెళ్లేందుకు మాత్రమే కారును ఉపయోగించుకోవాలి. కారు అలవెన్స్ బిల్లు పెట్టుకోవాలి. కానీ కందుకూరు అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టులో నిబంధనలకు విరుద్ధంగా సీడీపీఓ బిల్లులు పెట్టుకుంటున్నారు. విధుల్లో ఉన్నా లేకపోయినా, తనిఖీలు చేసినా చేయకపోయినా కారు అలవెన్స్ మాత్రం ప్రతి నెలా డ్రా చేస్తున్నారు.



కందుకూరు రూరల్: కందుకూరు అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో కందుకూరు అర్బన్, కందుకూరు మండలం, వలేటివారిపాళెం మండలాలున్నాయి. సీడీపీఓగా షర్మిష్ఠ ప్రకాశం విధులు నిర్వహిస్తున్నారు. ఈమె నెల్లూరులో నివాసం ఉంటూ రాకపోకలు సాగిస్తుంటారు. కందుకూరు అర్బన్ పరిధిలో 60 అంగన్‌వాడీ కేంద్రాలు, కందుకూరు మండల పరిధిలో 51, వలేటివారిపాళెం మండల పరిధిలో 53 మొత్తం 164 అంగన్‌వాడీ కేంద్రాలు సీడీపీఓ పర్యవేక్షణలో ఉన్నాయి. ఈ కేంద్రాలు తనిఖీ చేసి వాటి పనితీరును పరిశీలించే బాధ్యత సీడీపీఓపై ఉంది. ఈ కేంద్రాల వద్దకు వెళ్లేందుకు కారును ఉపయోగించుకొని అలవెన్స్ బిల్లును పెట్టుకుంటారు. కానీ సీడీపీఓ మాత్రం నిబంధనలకు విరుద్ధంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లకుండానే కారు అలవెన్స్‌ను వాడుకున్నారు. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో ఎన్నికల డ్యూటీపై కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సీడీపీఓకు డ్యూటీ వేశారు. ఏప్రిల్, మే నెలల్లో ఎన్నికల డ్యూటీలోనే ఉన్నారు. జూన్, జూలై నెలల్లో ఐసీడీఎస్ కింద బెంగళూరులో శిక్షణకు ఆమె వెళ్లారు. ఆ తర్వాత ఆగస్టు నెల మొత్తం మెడికల్ లీవ్ పెట్టి.. సెప్టెంబర్, అక్టోబర్ నెలలో విధుల్లో ఉన్నారు. ఏప్రిల్ నుంచి అక్టోబర్ నెల వరకు కారు అలవెన్స్ బిల్లులు పెట్టారు. ఆగస్టు నెల మినహా మొత్తం ఆరు నెలలకు కారు అలవెన్స్ బిల్లు డ్రా చేశారు. ఎన్నికల డ్యూటీలో ఉంటే ఎన్నికల ఖర్చులో డ్యూటీలో ఉన్న వారికి ప్రత్యేకంగా అలవెన్స్ ఇస్తారు. అదే విధంగా జూన్, జూలై నెలల్లో సీడీపీఓ ట్రైనింగ్‌లో ఉండటంతో సూపర్‌వైజర్లు ఆ కారును ఉపయోగించుకుని అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీకి వెళ్లినట్లు బిల్లులు పెట్టి డ్రా చేసుకున్నారు. అయితే సీడీపీఓ అయినా, సూపర్‌వైజర్లయినా కారు వాడింది లేదు. తనిఖీలకు వెళ్లిందీ లేదు. అయినా అధికారులు తనిఖీలు చేసినట్లు బిల్లులు పెట్టుకుంటున్నారు. ఆరు నెలలకు రూ.2,10,000 బిల్లు డ్రా చేశారు. ఇక సెక్టార్ మీటింగ్‌లు 90 శాతం ప్రతినెలా ప్రాజెక్టులోనే నిర్వహిస్తుంటారు. అంగన్‌వాడీ కార్యకర్తలే కందుకూరు ప్రాజెక్టు కార్యాలయం వద్ద వస్తుంటారు. అలాంటప్పుడు సెక్టార్ మీటింగ్‌లకు కూడా వీరు బయటకు వెళ్లరు. సీడీపీఓ వాడేది సొంత కారు అయినప్పటికీ బయట కారు నంబర్ పెట్టి బిల్లు పెట్టుకుంటున్నారు. ఇది కూడా జూన్, జూలై నెలల్లో సూపర్‌వైజర్లు కారును వినియోగించుకున్నట్లు బిల్లు పెట్టి అందులో కూడా పంచుకున్నట్లు సమాచారం. ఇలా పని చేయకపోయినా కారు అలవెన్స్ ద్వారా ప్రభుత్వ సొమ్మును అప్పనంగా మింగేస్తున్నారు. ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు అధికారులు కూడా దీనిని పట్టించుకోకుండా బిల్లులు మంజూరు చేయడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీలకు ఆమె వెళ్లరని తెలుస్తోంది.

స్టాఫ్ వాడారు



షర్మిష్ఠ ప్రకాశం

దీనిపై సీడీపీఓ షర్మిష్ఠ ప్రకాశంను వివరణ కోరగా ఎన్నికల సమయంలో ఆఫీస్‌లోనే ఎన్నికల డ్యూటీ వేశారన్నారు. ఉదయం 10 గంటలకు ముందు, సాయంత్రం 5గంటల తర్వాత ఐసీడీఎస్ కార్యాలయ పనులు, సమావేశాలకు వెళ్లానని తెలిపారు. అప్పుడు కారు వాడానని సమాధానం ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఉదయం 10 గంటల్లోపు, సాయంత్రం 5గంటల తర్వాత కార్యాలయ పని వేళలు ఉండవు. ఆ సమయంలో కార్యాలయ పనులకు వెళ్లానని సమాధానం చెప్పడం ఏమిటో ఆమెకే తెలియాలి. బెంగళూరులో ట్రైనింగ్‌కు వెళ్లినప్పటికీ 15 రోజులు కారు వాడానని, మిగిలిన రోజులు ఆఫీసు స్టాఫ్ వాడరని సమాధానం ఇచ్చారు. అయితే ట్రైనింగ్‌లో ఉన్నప్పటికీ సూపర్‌వైజర్లకు ఇన్‌చార్జి సీడీపీఓగా బాధ్యతలు అప్పగిస్తారు. అయినా ఇన్‌చార్జులు గానీ, కార్యాలయ స్టాఫ్ గానీ కారు వాడిన దాఖలాలు లేవు.

జిల్లాలో తేలికపాటి వర్షాలు

నెల్లూరు(అర్బన్): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలహీనపడినప్పటికీ దాని ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా తేలికపాటి జల్లులు కురుస్తున్నాయి. మంగళవారం ఉదయం నుంచి సాయంకాలం 6 గంటల వరకు జిల్లాలో సరాసరి వర్షం 3.4 మి.మీ.గా నమోదైంది. అనంతసాగరంలో 13.2 మి.మీ, విడవలూరులో 9.6 మి.మీ వర్షం కురిసింది. మిగతా అన్ని మండలాల్లో చిరు జల్లులు కురిశాయి. బుధవారం కూడా తేలికపాటి జల్లులు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది.

30 నుంచి దేహదారుఢ్య పరీక్షలు

నెల్లూరు(క్రైమ్): పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలను ఈనెల 30 నుంచి నగరంలోని పోలీసు కవాతు మైదానంలో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కానిస్టేబుల్ ఉద్యోగాలకు జిల్లాలో 20,356 మంది ప్రిలిమినరీ పరీక్షలు రాయగా వారిలో 4,600 మందికిపైగా దేహదారుఢ్య పరీక్షలకు అర్హత సాధించారు. పరీక్షలు ఈనెల 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

కేతిగుంట సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

నెల్లూరు(పొగతోట): సాధారణ నిధుల ఖర్చులో ఓచర్లు, ఆమోద తీర్మానాలు లేకుండా రూ.2,12,106 ఖర్చుకు సంబంధించి ఆధారాలు లేనందున మర్రిపాడు మండలం కేతిగుంట సర్పంచ్ ఎస్.హరితేజ చెక్‌పవర్‌ను రద్దు చేస్తూ డీపీఓ శ్రీధర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిధులు దుర్వినియోగమైనట్లు ఆత్మకూరు డివిజన్ పంచాయతీ అధికారి విచారణలో తేలిందన్నారు. దీనిపై సర్పంచ్‌కు నోటీసులు ఇచ్చినా సంజాయిషీ ఇవ్వలేదన్నారు.

క్లుప్తంగా

అంతర్జాతీయ యోగా పోటీల్లో ప్రతిభ


ట్రోఫీ అందుకుంటున్న అరుణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అంతర్జాతీయ యోగా చాంపియన్‌షిప్ పోటీల్లో నెల్లూరుకు చెందిన అరుణకుమారి ప్రతిభ చూపింది. ఇటీవల ఇండోనేషియాలో జరిగిన పోటీల్లో 40 - 45 వయో పరిమితి విభాగంలో విజయాన్ని సొంతం చేసుకుని ఇండియన్ యోగా అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఇలంగోవన్, నేషనల్ యోగా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాధాకృష్ణన్ చేతుల మీదుగా ట్రోఫీ అందుకుంది. శ్రీలంక, మలేషియా, సింగపూర్, పాకిస్తాన్ తదితర దేశాలకు చెందిన వారు తలపడిన పోటీల్లో అరుణ విజయం సాధించడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

మైనార్టీలకు ఉపాధి అవకాశాలు

- ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్


అధికారులతో మాట్లాడుతున్న షరీఫ్

నెల్లూరు(అర్బన్): మైనార్టీలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఎంఏ షరీఫ్ తెలిపారు. మంగళవారం నెల్లూరులోని ఆర్‌అండ్‌బీ అతిథి భవనంలో మైనార్టీ సంక్షేమ, మైనార్టీ కార్పొరేషన్, వక్ఫ్ బోర్డు అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మైనార్టీ యువతకు శిక్షణ ఇప్పించి పీఎంఈజీపీ రుణాలను మంజూరు చేయించాలన్నారు. చిన్న పరిశ్రమలను స్థాపించేలా అధికారులు కృషి చేస్తే ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అలాగే జిల్లాలో వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. అన్యాక్రాంతమైన వక్ఫ్ భూములను స్వాధీనం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణతో పని చేయాలన్నారు.

యూరియా కొరతతో రైతుల ఇబ్బందులు

- జెడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో వెల్లడించిన జెడ్పీటీసీ సభ్యులు
- చర్యలు తీసుకోవాలన్న చైర్‌పర్సన్ అరుణమ్మ
- విద్యుత్ సమస్యలపై ప్రశ్నించిన సభ్యులు
- ఇరిగేషన్ అధికారులపై ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి ఆగ్రహం


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, చిత్రంలో ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(పొగతోట): 'ప్రస్తుతం వ్యవసాయ పనులు జరుగుతున్నాయి. జిల్లాలో యూరియా కొరత ఉంది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు' అని పలువురు జెడ్పీటీసీ సభ్యులు వెల్లడించారు. దీనిపై చైర్‌పర్సన్ అరుణమ్మ స్పందించి రైతులు ఇబ్బందులు పడకుండా ఎరువులు, విత్తనాలు సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో మంగళవారం స్థాయీ సంఘ సమావేశాలు జరిగాయి. కలిగిరి, కొండాపురం, మర్రిపాడు జెడ్పీటీసీ సభ్యులు మాట్లాడారు. ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురైనా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రైతులు వ్యవసాయం చేయాలా? వద్దా? అని అధికారులను ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో లో-ఓల్టేజ్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. మా సొంత సమస్యలు పరిష్కరించాలని చెప్పడం లేదు కదా అంటూ నిలదీశారు. సమస్యలు చెబుతున్నా మండల స్థాయి అధికారుల నుంచి స్పందన ఉండటం లేదన్నారు. దీంతో చైర్‌పర్సన్ మాట్లాడుతూ సభ్యులు చెప్పిన సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ఆదేశించారు.

రాజకీయాలు వద్దు

చైర్‌పర్సన్ మాట్లాడుతూ 20 సంవత్సరాల నుంచి మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్న వారిని తొలగించడం అన్యాయమన్నారు. దీని విషయంలో రాజకీయాలను పక్కన పెట్టాలన్నారు. సంవత్సరాల తరబడి పనిచేస్తున్న వారిని ఒక్కసారిగా తొలగిస్తే వారి పరిస్థితి ఏమిటని అధికారులను ప్రశ్నించారు. అనేక పాఠశాలల్లో సమస్యలున్నా హెచ్‌ఎంలు అధికారుల దృష్టికి తీసుకెళ్లడం లేదన్నారు. చిన్నచెరుకూరు పాఠశాలలో ఉపాధ్యాయులు లేని కారణంగా ప్రజల డబ్బులు పోగు చేసి ప్రైవేట్‌గా టీచర్లను నియమించుకున్నారన్నారు. బడుల్లో ఆర్వో ప్లాంట్ల మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో అక్రమాలు జరుగుతున్నాయన్నారు. అక్రమాలకు పాల్పడే సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకుని వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని తెలిపారు. మంచినీటి మోటార్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. వాటర్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో లేఅవుట్ల లెవలింగ్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. పేద ప్రజలు ఉంటున్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని చెప్పారు. వివిధ శాఖలపై చైర్‌పర్సన్ సమీక్షించారు. నిధుల మంజూరు కోసం సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ వినతిపత్రం అందజేశారు.

సమాచారం ఇవ్వరా?


ఇరిగేషన్ అధికారితో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

సమావేశానికి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విచ్చేశారు. చిన్న సమాచారం అడిగినా ఇవ్వలేని దుస్థితి నెలకొందంటూ ఇరిగేషన్ అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జాఫర్‌సాహెబ్ కాలువపై వాకింగ్ ట్రాక్ నిర్మించారు. ఇప్పుడు అక్కడ దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ స్థలం ఇరిగేషన్ శాఖదా? కాదా?, దుకాణాల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చారా? లేదా? అని వివరాలు ఇవ్వాలని గత డీఆర్‌సీలో అడిగాను. ఐదు పర్యాయాలు పీపీను ఇరిగేషన్ కార్యాలయానికి పంపించాను. 35 రోజులు గడుస్తున్నా సమాచారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీనైన నాకే సమాచారం ఇవ్వకుంటే ప్రజల పరిస్థితి ఏందంటూ అసహనం వ్యక్తం చేశారు. ఇరిగేషన్ ఎస్ఈ సమావేశానికి రాలేదు. డీఈ వచ్చారు. దీంతో ఎమ్మెల్సీ ఎస్ఈకి ఫోన్ చేసి మాట్లాడారు. దుకాణాలు ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఉన్నాయా? లేదా? అని సమాచారం ఇవ్వాలన్నారు. వారం రోజుల్లోపు వివరాలిస్తామని ఎస్ఈ తెలిపారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ విద్యారమ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళను మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): మహిళను నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై నెల్లూరు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. ఖుద్దూస్ నగర్‌కు చెందిన ఓ మహిళకు 2015లో హుమయూన్ అనే వ్యక్తితో వివాహమైంది. విభేదాల కారణంగా ఆమె భర్త నుంచి విడాకులు తీసుకుని ఒంటరిగా ఉంటోంది. ఈ క్రమంలో ఆమెకు ఫయాజ్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. తనకు వివాహమైందని, భార్య నుంచి విడాకులు తీసుకుని ఒంటరిగా ఉంటున్నానని నమ్మించాడు. దీంతో ఇద్దరూ కొంతకాలంగా సహజీవనం చేస్తున్నారు. మహిళ వద్దనున్న రూ.3 లక్షలు తీసుకుని ఖర్చు చేశాడు. రెండునెలలుగా అతను కనిపించలేదు. దీంతో బాధిత మహిళ ఆరాతీయగా ఫయాజ్ తన భార్యతో కలిసి ఉంటున్నాడని తేలింది. భార్యతో ఉంటూనే విడాకులు తీసుకున్నానని తనను నమ్మించి మోసగించడంతోపాటు నగదు కాజేసిన ఫయాజ్‌పై చర్యలు తీసుకోవాలని మంగళవారం బాధితురాలు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై అయ్యప్ప కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విజయదీపిక స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ


మెటీరియల్‌ను ప్రదర్శిస్తున్న అరుణమ్మ తదితరులు

నెల్లూరు(పొగతోట): పదో తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన విజయదీపిక స్టడీ మెటీరియల్‌ను నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో మంగళవారం జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలనే సంకల్పంతో ప్రతి సంవత్సరం జెడ్పీ నిధులతో స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్నామన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 15,597 మంది విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్‌లో మెటీరియల్‌ను పంపిణీ చేస్తామన్నారు. మెరుగైన ఫలితాల సాధన కోసం జిల్లాలోని ఉపాధ్యాయులంతా కృషి చేయాలన్నారు. స్టడీ మెటీరియల్‌ను రూపొందించిన వారిని జెడ్పీ ద్వారా సన్మానిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ విద్యారమ, డీఈఓ బాలాజీరావు, జెడ్పీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు

క్రిస్మస్ పండగను సంతోషంగా జరుపుకోవాలి


ఆనంద్, కలెక్టర్


కార్తీక్, జేసీ


కృష్ణకాంత్, ఎస్పీ


కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు రూరల్: కలెక్టర్ ఆనంద్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, సేవాతత్పరత, క్షమాగుణాన్ని బోధించిన ఏసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పండగను బుధవారం సంతోషంగా చేసుకోవాలని ఆకాంక్షిస్తూ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. క్రీస్తు జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని స్ఫూర్తివంతమైన జీవితాన్ని గడపాలని సూచించారు.

- జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు చూపిన సన్మార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు.
- నెల్లూరు(క్రైమ్): ఎస్పీ జి.కృష్ణకాంత్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచానికి శాంతిని ప్రబోధించిన ఏసుక్రీస్తు మార్గం ఆచరణీయమైందన్నారు. బుధవారం క్రిస్మస్ పండగను శాంతి సామరస్యాలతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు.
- నెల్లూరు(బారకాసు): క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సాటి మనుషులపై ప్రేమ, అవధుల్లేని త్యాగం, శాంతియుత జీవనం.. ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు ఇచ్చిన మహోన్నత సందేశాలని పేర్కొన్నారు. క్రీస్తు బోధనలు సన్మార్గంలో నడిపిస్తాయన్నారు.

మూడో అంతస్తు నుంచి పడి.. మహిళ మృతి

నెల్లూరు(క్రైమ్): మూడో అంతస్తు నుంచి కిందపడి మహిళ మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు ఇరుగాళమ్మ సంఘం సమీపంలోని రాజీవ్ గృహకల్ప అపార్ట్‌మెంట్‌లో వేణుగోపాల్, లక్ష్మీదేవి (41) దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు సంతానం. వేణుగోపాల్ గతంలో ఏటీఎం వద్ద సెక్యూరిటీ గార్డుగా పనిచేశాడు. ప్రస్తుతం అనారోగ్యంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. లక్ష్మీదేవి మాగుంట లేఅవుట్లోని ఓ ప్రముఖ వస్త్ర దుకాణంలో పనిచేస్తోంది. మంగళవారం ఆమె తన అపార్ట్‌మెంట్ మూడో అంతస్తు నుంచి చెత్త వేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి తలకు తీవ్రగాయమైంది. ఈ విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని లక్ష్మీదేవిని పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతురాలి భర్త చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై వీసీ సుబ్రహ్మణ్యం ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.29
సన్నవి : రూ.20
పండ్లు : రూ.12

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 109 లేయర్ (లైవ్) : 100
బ్రాయిలర్ చికెన్ : 200 బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 220
లేయర్ చికెన్ : 170

కౌలు రైతులకు సకాలంలో రుణాలు


- కలెక్టర్ ఆనంద్


మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: 'కౌలు రైతులకు సకాలంలో రుణాలివ్వాలి. ఈ విషయంలో బ్యాంకులు కూడా చురుకైన పాత్ర పోషించాలి' అని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. కెనరా బ్యాంక్ లీడ్ మేనేజర్ జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశాన్ని మంగళవారం నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేశారు. సెప్టెంబర్ 2024తో ముగిసిన అర్ధ సంవత్సరానికి వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించి బ్యాంకుల పనితీరును ఆరాతీశారు. పీఎం ముద్ర యోజన, సీసీఆర్ కార్డులు, పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌బీవై, పీఎం జనసురక్ష, కేసీసీ పశుసంవర్ధక, మత్స్య పరిశ్రమ రుణాల మంజూరుపై సమీక్షించారు. పీఎస్ఎల్ లక్ష్యాలను చేరుకోని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లబ్ధిదారుల వ్యాపార అవసరాల కోసం పీఎంఈజీపీ కింద బ్యాంక్‌లకు అనుసంధానం చేయాలని జీఎం, డీపీసీని ఆదేశించారు. పంట రుణాలిచ్చే వరకు సరైన పర్యవేక్షణ చేయాలన్నారు. పీఎంఎఫ్‌బీవై, డబ్ల్యూబీసీఐఎస్ కింద రుణం పొందిన రైతుల పంటలకు తప్పకుండా బీమా చేయాలని సూచించారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

- జాయింట్ కలెక్టర్ కార్తీక్


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న అధికారులు

నెల్లూరు(పొగతోట): వినియోగదారులందరూ తమ హక్కులపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని జేసీ కె.కార్తీక్ అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని మంగళవారం నెల్లూరులోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఆన్‌లైన్ చెల్లింపుల్లో బాధితులు పెద్ద వయసువారే అధికంగా ఉంటున్నారన్నారు. యువత చొరవ తీసుకుని అవగాహన కల్పించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఉచితంగా అందజేసే వైఫై ద్వారా ఆన్‌లైన్ కొనుగోళ్లు, చెల్లింపులు చేయడం శ్రేయస్కరం కాదన్నారు. వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శేఖర్ మాట్లాడుతూ వినియోగదారులకు సేవాలోపం జరిగితే కేసు వేయొచ్చన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సమావేశంలో డీఎస్ఓ వెంకటరమణ, జిల్లా వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాసులు, ఫుడ్ సేఫ్టీ అసిస్టెంట్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు, తూనికలు కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ ఐజాక్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కీర్తి తదితరులు పాల్గొన్నారు.

18 మద్యం బాటిళ్ల స్వాధీనం


మాట్లాడుతున్న ఎస్సై

అనుమసముద్రంపేట: ఓ వ్యక్తి నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సైదులు తెలిపారు. మంగళవారం ఆయన పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. అక్రమంగా మద్యం తరలిస్తున్న పెద్దబ్బీపురానికి చెందిన ఓ వ్యక్తిని ఏఎస్‌పేటలోని వినాయక సెంటర్ వద్ద పట్టుకుని 18 బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

సాక్షి క్లాసిఫైడ్స్